క్లుప్తంగా

వైభవంగా ఆది దంపతుల కల్యాణం



మడికిలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని మడికిలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వర శర్మ, అయిలూరి బ్రహ్మన్న వేద మంత్రోచ్చారణల మధ్య శనివారం రాత్రి నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయానికి, దేవతా మూర్తుల విగ్రహాలకు చేపట్టిన పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆలయ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



చింతలమోరిలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం

మలికిపురం: మండలంలోని చింతలమోరిలో వేంచేసిన పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దొడ్డా బ్రహ్మాజీ–విజయదుర్గా భవానీ దంపతులు కల్యాణం నిర్వహించారు. వీరి చేతుల మీదుగా కళ్యాణమూర్తులకు వెండి కిరీటం, పాదాలు సమర్పించారు. అనంతరం గ్రామంలో రథోత్సవం జరిగింది. అన్నదానంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో అప్రకటిక విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌కో శాఖ రేయింబవళ్లు ముందస్తు సమాచారం లేకుండా ఇష్టానుసారం విద్యుత్ కోతలు విధించడంతో చిన్న తరహా పరిశ్రమలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. అసలే వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల ఎండలు మండిపోతుంటే అదే సమయంలో విద్యుత్ కోతలు విధించడం ప్రజలకు శాపంగా పరిణమించింది. ఇకనైనా ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణలో పాల్గొనాలి



అప్పనపల్లిలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే వేమా

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా కోరారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అప్పనపల్లిలో ఆదివారం బీజేపీ నేతలు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామ కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కాలుష్యం పెరగడం వల్ల వాతావరణంలో మార్పులు ఏర్పడి భూతాపం పెరిగిపోతుందని వేమా అన్నారు. దీని వల్ల రేపటి తరాల మనుగడ కష్టంగా మారుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అయిదు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, కోటిపల్లి సాయిబాబు, అడపా వెంకటరత్నం, ఆకుల దొరబాబు, యాండ్ర సూర్య, అరిగెల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

వయ్యారి భామ.. రైతులకు శ్రమ..

- సమస్యాత్మక కలుపు మొక్క విస్తరణ
- పంటలకు సోకుతున్న చీడపీడలు



అంబాజీపేటలో ఉధృతంగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు

అంబాజీపేట: సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారి భామ విస్తారంగా వ్యాపిస్తోంది. రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక హానికరమైన కలుపుమొక్క అయిన దీనిని కాంగ్రెస్ గడ్డి, నక్షత్ర గడ్డి, మంగమ్మ చెట్టు అని పిలుస్తారు. దీనిని నివారించేందుకు ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి, తిరుపతిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వయ్యారి భామను నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కో మొక్క 10 వేల నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వరి పంట పొలాలు, కొబ్బరి తోటలు, పూల తోటలు, రహదారి వెంబడి, జనావాసాలు చుట్టూ, విస్తారంగా పెరుగుతోంది. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల్లో సాగు చేస్తున్న కొబ్బరి తోటలు, వరి పంట పొలాలు, కూరపాదుల్లోనూ వేల ఎకరాల్లో ఈ వయ్యారి భామ ఉధృతి అధికంగా ఉంది.

కలిగే నష్టాలు ఎన్నో...

పంట పొలాల్లో 40 శాతం, పశుగ్రాసం పంటలలో 90 శాతం దిగుబడిని ఈ వయ్యారి భామ తగ్గిస్తుంది. పార్థీనియం కొన్ని రకాల వైరస్‌లకు ఆశ్రయమిస్తూ వివిధ పంటల్లో వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణమవుతుంది. మనుషులలో డెర్మాటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటిస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కండ్లు ఎర్రబడటం, కనురెప్పలు వాయడం మొదలైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. పశువులలో వెంట్రుకలు రాలిపోవడం, హైపర్‌టెన్షన్‌కు గురికావడం జరుగుతుంది.

నివారణ పద్ధతులు..

మొక్కలు పూతకు రాకముందే చేతులకు తొడుగులు ధరించి పీకి వేసి తగులబెట్టాలి. జైగోగ్రామా, బైకొలరేటా పురుగులను ఉపయోగించి జీవనియంత్రణ ద్వారా ఈ మొక్కలను నిర్మూలించవచ్చు. ఆయా పంటలలో సంబంధిత కలుపు నాశినిలను ఉపాయోగించి నివారించవచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొనాలి



పాశర్లపూడిలంక యోగా శిక్షణలో పాల్గొన్న మహిళలు



పినపళ్లలో యోగా నిర్వహిస్తున్న ఆరోగ్య, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొనాలని పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆదివారం యోగా శిబిరంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ప్రతి రోజు పది నిమిషాలు యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పురాతన కాలం నుంచి యోగా ఆచరణలో ఉందని చెప్పారు. నేటి ఆధునిక జీవన శైలిలో ఇది ప్రతి ఒక్కరికీ అత్యవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మట్టపర్తి కస్తూరి, డ్వాక్రా యానిమేటర్లు శిరీష, నీలిమ, స్థానికులు పాల్గొన్నారు.

పినపళ్లలో..

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు జిల్లా డీఆర్‌డీఏ టి.సాయినాథ్ జయచంద్ర గాంధీ, ఎంపీడీఓ ఎ.రాజు ఆదేశాల మేరకు ఈనెల 21న జరిగే యోగా డేను విజయవంతం చేయాలని ఏపీఎం ఎం.ధనరాజు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ, వెలుగు శాఖ ఆధ్వర్యంలో యోగా డే జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు విచ్చేసి యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను, ఆరోగ్యానికి దోహద పడే విషయాలను వివరించారు. అనంతరం యోగా డేలో పాల్గొనే ఆశావహుల వివరాలను గ్రామ కార్యదర్శులు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో యోగా డే ఆవశ్యకతను వివరించారు.

ధాన్యం కొనలేక చేతులెత్తేసిన ప్రభుత్వం



బెల్లంపూడిలో ఇటీవల ధాన్యం రాశులను పరిశీలించిన సర్పంచ్ మహాలక్ష్మి

పి.గన్నవరం: రైతులు శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేక ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని బెల్లంపూడి గ్రామ సర్పంచ్ బండి మహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో వందలాది ధాన్యం రాశులు ఉన్నాయని, రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇటీవల తాను పీజీఆర్ఎస్ జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినట్టు ఆమె వివరించారు. దీంతో తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. సంబంధిత అధికారులు బెల్లంపూడికి వచ్చి ధాన్యం రాశులను పరిశీలించారని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం టార్గెట్ ఇవ్వలేదని, కారణంగా ఓపెన్ మార్కెట్లో విక్రయించు కోవాలని లిఖిత పూర్వకంగా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు ఉచిత సలహా ఇచ్చి వెళ్లిపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు చేసేది ఏమీలేక బస్తా ధాన్యాన్ని రూ.1350 నుంచి రూ.1400లకు దళారులకు అమ్ముకుంటున్నారని వివరించారు. దీంతో బస్తాకు రూ.350ల నుంచి రూ.400ల వరకూ నష్టపోతున్నారని మహాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజనూ ఆర్‌బీకేల ద్వారా నేరుగా కొనుగోలు చేసి, బస్తాకు రూ.1740 వంతున గిట్టుబాటు ధరను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేదని సర్పంచ్ మహాలక్ష్మి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ తీసేసి, ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా దుర్మార్గమైన చర్య అని మహాలక్ష్మి అన్నారు.


భానుడి భగభగలు



అంబాజీపేటలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: రోహిణి కార్తె ఎండలు గత మూడు రోజులుగా పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. గత నెల 25వ తేదీన రోహిణి కార్తె ప్రవేశించింది. అయితే నాటి నుంచి పది రోజులు పాటు వర్షాలు కురిశాయి. ఎండా కాలంలో వర్షాకాలం వచ్చిందా..? అనే విధంగా ఒక మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. జూన్ నెల ప్రారంభం నుంచి తిరిగి ఎండలు ఊపందుకున్నాయి. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ వచ్చాడు. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత మరింత పెరగడంతో వేడి గాలులు వీయడంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎండ ప్రభావానికి అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, రావులపాలెం, రాజోలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. జనసంచారం లేక వెలవెలబోయాయి. దాదాపు 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి 8 గంటల వరకు 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు కొనసాగడం గమనార్హం. మండే ఎండలు ఉక్కబోతతో వృద్ధులు, పిల్లలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. చిరు వ్యాపారులు సైతం ఎండ దెబ్బకు మూలనపడ్డాయి. సూర్యుడు అస్తమించే వరకూ పక్షుల జాడ కానరావడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది. సూర్యుడు భగభగలాడిపోతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎండల్లో తిరగరాదని వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే తక్షణమే చికిత్స చేయించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని శ్రమ జీవులు మండుతున్న ఎండలకు విలవిల్లాడిపోతున్నారు. రోజు మొత్తం పని చేసేందుకు వీలు లేకపోవడంతో ఉదయం పూట పనికి వెళుతున్నారు.

వైభవంగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



నల్లచెరువులో శ్రీకృష్ణునికి పూజలు నిర్వహిస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణభగవానుకి ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో కృష్ణభగవానునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ప్రభూజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఐదు గంటలకు హరినామ సంకీర్తనలు చేశారు. శ్రీమద్భాగవత ప్రవచనం నిర్వహించారు. స్వామివారి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని కీర్తించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

ఈఏపీ సెట్‌లో ప్రవీణ్‌కుమార్‌కు 153వ ర్యాంకు



ప్రవీణ్‌కుమార్

మామిడికుదురు: ఈఏపీ సెట్‌లో పాశర్లపూడిలంకకు చెందిన కోలా ప్రవీణ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో 153వ ర్యాంకు సాధించాడు. అతనికి 123.96 మార్కులు వచ్చాయి.

వ్యవసాయ కుటుంబానికి ప్రవీణ్ తండ్రి గోపాలకృష్ణ రైతు. తల్లి జ్యోతి గృహిణి. ప్రవీణ్‌కుమార్ తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో కూడా ఆ రాష్ట్ర స్థాయిలో 52వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలపైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 328వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ఇతడు విజయవాడ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ఈఏపీ సెట్‌లో ప్రతిభ చూపిన ప్రవీణ్ కుమార్‌ను పలువురు అభినందిచారు.

అయినవిల్లిలో భక్తజన సందోహం



అర్చకుని ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకదశ రుద్రాభిషేకాల్లో 39 మంది, లక్ష్మీగణపతి హోమంలో 13 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో ఇద్దరు దంపతులు పూజలు చేశారు. స్వామివారి గరిక పూజలో ఒక జంట, స్వామికి ఉండ్రాళ్ల పూజ ఐదు జంటలు చేశాయి. స్వామి వారి సన్నిధిలో 29 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఎనిమిది మందికి తులాభారం, నలుగురికి నామకరణ చేశారు. అన్నప్రాశన 12 మంది చిన్నారులకు నిర్వహించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,59,175లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

అనారోగ్య బాధితుడికి సాయం



లక్ష్మీనారాయణకు సాయం అందిస్తున్న గ్రూపు సభ్యులు

మలికిపురం: రాజోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వీరవల్లి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఉండడంతో చికిత్స నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి గ్రూప్ సభ్యులు సమకూర్చిన రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిడిశెట్టి సూర్యనారాయణ, మామిడిశెట్టి మధుసూదనరావు, కుక్కల శ్రీరామ్మూర్తి , కుడుపూడి సత్యనారాయణ, పితాని శ్రీనివాస్, కడలి శ్రీను, మామిడిశెట్టి నగేష్, గెద్దాడ శ్రీను తదితరులు పాల్గొని దాతలను అభినందించారు. గ్రూప్ సభ్యులు కడలి కృష్ణార్జునుడు, దొంగ సత్తిబాబు, గుబ్బల గోవర్ధన పద్మకుమారి, కాండ్రేగుల నాగరాజు, దొమ్మేటి రమేష్, చెల్లుబోయిన సూర్య చంద్రప్రకాష్, కాండ్రేగుల లక్ష్మీ నరసింహమూర్తి, కట్టా వాసు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగాభ్యసన విజయవంతం చేయాలి



ద్రాక్షారామలో యోగా కార్యక్రమ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆర్డీవో అఖిల, ఇతర అధికారులు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన ద్రాక్షారామలో నేటి ఉదయం 6 గంటలకు భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యోగా అభ్యసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామచంద్రపురం ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఆమె రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఇతర అధికారులతో కలసి భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆమె సోమవారం ఉదయం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాజెక్ట్ చెరువులో చేపల మృత్యువాత

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీ పరిధి రావి చెట్టు సెంటర్లో ఉన్న తాగునీటి ప్రాజెక్ట్‌లో ఆదివారం చేపలు మృత్యువాత పడ్డాయంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మూడు రోజుల క్రితం గ్రామంలో పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోందని మురుగునీటి బాటిళ్లతో గ్రామస్తులు నిరసన చేపట్టారు.

ఆ సమయంలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ప్రాజెక్ట్‌ను పరిశీలించి గ్రామస్తులకు ప్రత్యామ్నాయంగా మండల ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తమ నిరసనను విరమించారు. అధికారులు ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతులు చేసి నీరు అందించే క్రమంలో మరలా చెరువులో చేపలు మృత్యువాత పడటం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రాజెక్ట్‌లో చనిపోయిన చేపలను చూపుతూ నిరసన చేపట్టారు. అక్టోబరు 2న నిర్వహించిన గ్రామ సభలో మురుగునీరు శుద్ధి కాకుండా కుళాయిల ద్వారా నేరుగా రావడంతో పంచాయతీరాజ్ కమిషనర్‌కు చేరే విధంగా పంచాయతీలో ఫిర్యాదు చేసిన సిబ్బంది సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని పలువురు అన్నారు. కలుషిత నీటితో గ్రామ ప్రజలు ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు చేసి, రెండు రోజులుగా పంచాయతీ, సీడబ్ల్యూపీసీ స్కీముల నుంచి తాగునీరును అందించామని, చేపలు చనిపోవడంతో పంచాయతీ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసి సీడబ్ల్యూపీసీ స్కీము నుంచి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

కలెక్టర్ తనయుడికి అంతర్వేదిలో అక్షరాభ్యాసం



అంతర్వేది ఆలయంలో కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ దంపతులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామివారి ఆలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆయన కుమారుడికి అక్షరాభ్యాసం చేయించారు. తొలుత స్వామివారి దర్శనానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి సన్నిధిలో కుటుంబ సమేతంగా కలెక్టర్ కుమారుడికి అక్షరాభ్యాసం చేశారు. కలెక్టర్‌కు స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఏసీ సత్యనారాయణ అందజేశారు. కాగా స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పర్యవేక్షణలో వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి అక్షరాభ్యాసానికి సంబంధించి పూజలు చేశారు. అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలను కలసిన బాబి



జక్కంపూడి రాజాను కలసిన బాబి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా మాకనపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల బాబిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను రాజమహేంద్రవరంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అతనితో పాటు పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవిని కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ యువజన విభాగాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారని బాబి తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో రెండు కిడ్నీలు పాడైన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాకినాడకి చెందిన సంకు సురేష్‌కి రెండు కిడ్నీలు పాడయిపోయాయి. డయాలసిస్ చేయించుకుంటున్నారు. కిడ్నీ మార్చుకోవాలని డాక్టర్లు చెప్పారు. ఆర్థికంగా అంతస్తోమత లేని వారు కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో రావులపాలెంలో సురేష్ భార్య దివ్యకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11 వేల చెక్కు సాయంగా అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం నుంచి ముక్కామల వైపు వస్తున్న ఆటోను ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొన్నాయి. దాంతో మోటారు సైకిలిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అంబాజీపేట పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.

66 బీరు సీసాల స్వాధీనం



పట్టుబడిన బీరు సీసాలు

ఐ.పోలవరం: పుదిచ్చేరి యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టుగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. యానాం నుంచి ఎదుర్లంక మీదుగా కారులో 66 బీరు సీసాలను తరలిస్తున్నారు. ఎదుర్లంక వద్ద ఉన్న చెక్ పోస్టు వద్ద తనిఖీలో బీరు సీసాలు దొరికాయి. కారుతోపాటు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

భూముల కౌలుహక్కు బహిరంగ వేలం ప్రకటన సవరణ

Dr.B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం డివిజన్ మరియు మండలము నందు ఉన్న శ్రీ మంత్రి ప్రగడ వారి సత్రము హక్కు భూక్తములో పి.గన్నవరం మండలము వై.ఏనుగుపల్లి గ్రామములో గల రి.స.నెం.83/2ఎ లో ఎ3.09సెంట్లు మెరక భూమి(లంక భూమి) 2025 2026 సంవత్సరము నుండి 2027-2028 సంవత్సరము వరకు 3 సంవత్సరములు కౌలుహక్కుకు గాను ది.13.06.2025 తేదీ శుక్రవారం ఉదయము గం10.00 నిమిషంలకు వై.ఏనుగుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయమునందు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున నిర్వహించుటకు ది.06.06.2025 తేదీన ఇచ్చిన ప్రకటన సవరణ చేయుట జరిగినది గమనించగలరు. ఈ పాటలు ది.19.06.2025 గురువారం ఉదయము గం 10.00 నిమిషంలకు వై.ఏనుగుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయము నందు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున దేవాదాయ ధర్మదాయశాఖ చట్టములోని నిబంధనలను అనుసరించి సదరు భూమిని కౌలు హక్కునకు బహిరంగ వేలం పాట జరుపబడును.

వై.ఏనుగుపల్లి,
తేది: 08-06-2025.

సం/- జె. రామలింగేశ్వరరావు
కార్యనిర్వహణాధికారి.